## హెడ్డాఫీస్‌లో రెండో రోజూ రిజిస్టర్ల తనిఖీ..

కొత్తగూడెం సింగరేణి, మే 28: కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం రిక్రూట్‌మెంట్ సెల్‌లో రెండో రోజు బుధవారమూ తనిఖీలు కొనసాగాయి. సింగరేణి ఎస్టీ ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్ బృంద సభ్యులు రిజిస్టర్ల తనిఖీని చేపట్టారు. సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను అంతర్గత, ఎక్స్‌టర్నల్ పద్ధతిలో భర్తీ చేసేందుకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, రోస్టర్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం రిక్రూట్‌మెంట్ బెర్నడిట్ నికోలస్ మాట్లాడుతూ.. సింగరేణి ఎస్టీ ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్, వారి బృంద సభ్యులు రోస్టర్ తనిఖీపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఎస్టీ ఉద్యోగుల లైజన్ ఆఫీసర్, ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, జీఎం రిక్రూట్‌మెంట్ బెర్నడెట్ నికోలస్, ఎస్టీ అసోసియేసన్ నుంచి భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, పంతులా పాల్గొన్నారు.

## సింగరేణి జాగృతి కార్పొరేట్ కో ఆర్డినేటర్‌గా కిరణ్


కిరణ్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న కవిత

కొత్తగూడెం సింగరేణి, మే 28: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. నూతనంగా ఏర్పాటుచేసిన సింగరేణి జాగృతికి కొత్తగూడెం కార్పొరేట్ కో ఆర్డినేటర్‌గా వసికర్ల కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం అతడికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకు నష్టం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. సింగరేణి సంస్థలో కార్మికులను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ బిడ్డలుగా తమపై ఉందని అన్నారు. అందుకోసమే సింగరేణి జాగృతిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## మదన్‌లాల్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న హరిప్రియానాయక్

ఇల్లెందు, మే 28: వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బానోత్ మదన్ లాల్ మృతదేహాన్ని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియానాయక్ బుధవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో సందర్శించారు. పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

భద్రాచలం, మే 28: మదన్‌లాల్ మృతికి భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు బుధవారం సంతాపం తెలిపారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్, కో-కన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతో మేలు

టేకులపల్లి, మే 28: సేంద్రియ సాగు ఉపయోగకరంగా ఉంటుందని కేవీకే కో-ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ అన్నారు. మండలంలోని బోడు రైతు వేదికలో బుధవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. యూరియా మోతాదు తగ్గించాలన్నారు. భూమి, నీటి వనరులను కాపాడుకునేందుకు సేంద్రియ వ్యవసాయ విధానం అలవాటు చేసుకోవాలన్నారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. పంట మార్పిడితో మునగ, పామాయిల్, వెదురు పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. శాస్త్రవేత్త శివ, ఏడీఏ లాల్‌చంద్, ఏవో అన్నపూర్ణ, ఏఈవో రమేష్ పాల్గొన్నారు.

## యువకుల శ్రమదానం


చప్టా నిర్మాణ పనుల్లో యువకులు

అశ్వారావుపేట టౌన్, మే 28: పట్టణంలోని దూదేకుల బజార్‌లో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన చప్టాపై స్థానిక యువకులు బుధవారం శ్రమదానంతో రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని గత పంచాయతీ పాలకవర్గంలో, అధికారులు గాలి పట్టించుకోలేదు. ఇంతలోనే అశ్వారావుపేట మున్సిపాలిటీగా ఏర్పడింది. నిధుల కొరత కారణంగా పనులు చేపట్టలేదు. దీంతో విసుగెత్తిన స్థానిక యువకులు శ్రమదానంతో చప్టాపై తాత్కాలికంగా రహదారి నిర్మించుకున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం, మే 28: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అశ్వాపురం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ అశోక్ తెలిపిన వివరాలు.. బూర్గంపహాడ్ మండలం నుంచి అశ్వాపురం వైపు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో సీతారాంపురం వద్ద పోలీసులు నిఘా వేసి, వాహనాల తనిఖీ చేపట్టారు. బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం సహా వాహనాన్ని స్వాధీనపర్చుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

టెలికాలర్స్ కావలెను

★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/- నుండి 20,000/-వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999

KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

అశ్వారావుపేట, మే 28: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పద్దం కృష్ణారావు(49) భార్య విజయ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన మనోవేదనతో మద్యానికి అలవాటు పడ్డాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అతడు ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం మృతి చెందాడు. అతడి కుమారుడు వంశీ ఫిర్యాదుతో కేసును ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

# అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

**ఉద్యోగులు చిల్లర రాజకీయాలు చర్యలు తప్పవు**
**వివిధ శాఖల అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క**
**హాజరైన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ బలరాం**
**మీడియాను బయటకు వెళ్లాలన్న భద్రాద్రి కలెక్టర్**


కొత్తగూడెం కలెక్టరేట్‌లో రెండు జిల్లాల అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సీతక్క

భద్రాద్రి కొత్తగూడెం, మే 28 (నమస్తే తెలంగాణ): బాలల భవిష్యత్ అంగన్‌వాడీ టీచర్ల చేతుల్లో ఉంటుందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖల రెండు జిల్లాల అధికారులతో ఆయా శాఖల ప్రగతిపై కొత్తగూడెం ఐడీఓసీలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికీ సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో భవనాలు లేనందున ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉంటే వాటిలో కేంద్రాలు ఏర్పాటు చేసుకునే విధంగా కలెక్టర్లు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తే వాటిని తిరస్కరించాలన్నారు. ఉద్యోగులు చిల్లర రాజకీయాలు చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వేసవి సెలవుల అనంతరం టీచర్లు సెల్ఫీ వీడియోలు తీసి అంగన్‌వాడీ కేంద్రాలను ఓపెన్ చేయాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులతో సమీక్షిస్తూ.. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తూ.. వర్షాకాలంలో రహదారులు మరమ్మతులు పూర్తి చేయాలని, వాగుల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, జేడీ సునంద, ఆర్‌జేడీ ఝాన్సీ, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా పాల్గొన్నారు.

### మీడియా బయటకు వెళ్లాలన్న కలెక్టర్

'మీడియా ప్రతినిధులందరూ బయటకు వెళ్లాలి' అంటూ భద్రాద్రి కలెక్టర్ జితేశ్ అన్నారు. దీంతో మంత్రి సీతక్క సమీక్ష కవరేజ్‌కు వచ్చిన మీడియా ప్రతినిధులందరూ సమీక్ష ప్రారంభంలోనే బయటకు వచ్చేశారు. అయితే, మంత్రి సమీక్షకు విలేకరులందరూ రావాలంటూ జిల్లా పౌర సంబంధాల అధికారి మీడియా వాట్సప్ గ్రూపులో సమాచారం ఇచ్చారు. దీంతో విలేకరులందరూ కవరేజీకి వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక బయటకు పంపించడంపై విలేకరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియాకు అనుమతి లేదని ముందుగా చెబితే వచ్చేవాళ్లం కాదని, ఇలాంటి తప్పుడు సమాచారంతో విలేకరుల సమయాన్ని వృథా చేయడం తగదని డీపీఆర్‌వోపై మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్: ఏడీఏ


విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

జూలూరుపాడు, మే 28: విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కొత్తగూడెం ఏడీఏ నర్సింహారావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని విత్తన దకాణాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అప్పుడు తప్పకుండా రసీదు తీసుకొని భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయశాఖాధికారి దీపక్ ఆనంద్, ఎస్సై ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

### పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం: ఏవో

చుంచుపల్లి, మే 28: రైతులకు పంపిణీ చేసేందుకు సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు ఏవో రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జిలుగుల బస్తా ఖరీదు రూ.4,275 కాగా రైతులకు 50 శాతం సబ్సిడీపై రూ.2137.50కే ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏఈవో వద్ద టోకెన్ తీసుకొని ఆధార్ కార్డు జిరాక్సు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు తీసుకొని రావాలని సూచించారు. కాగా, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు తెలిపారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

అశ్వారావుపేట, మే 28: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వ్యాపారులను సీఐ నాగరాజు హెచ్చరించారు. వ్యవసాయ శాఖ సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆయన బుధవారం వ్యవసాయ శాఖాధికారులతో కలిసి తనిఖీ చేశారు. పత్తి, మొక్కజొన్న విత్తన నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. అధిక ధరలు వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. పీఎస్ఐ అఖిల, ఏవో శివరాం ప్రసాద్, ఏఈవో సతీష్ పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

**132 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం**



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

మణుగూరు టౌన్, మే 28: ఈ నెల 23న మణుగూరు మెయిన్ రోడ్‌లోని శ్రీవారి జ్యువెలర్స్ షాపులో చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపిన వివరాలు.. ఈ నెల 23న మధ్యాహ్నం శ్రీవారి జ్యువెలర్స్ షాపులో ఒక్కరే ఉండడాన్ని గమనించి ఓ వ్యక్తి, మాస్క్ వేసుకుని లోపలికి వచ్చాడు. సుమారు 132 గ్రాముల బంగారు ఆభరణాలున్న బాక్స్ దొంగిలించాడు. షాపు యజమాని దేవతా శ్రీనివాస్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై ప్రసాద్, సీసీఎస్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలసులు మూడు బృందాలుగా ఏర్పడి, నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలోనే, ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో కలిసి స్థానిక హనుమాన్ టెంపుల్ వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసిన ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించారు. తన పేరు గొర్రెల సత్యనారాయణ అని, ఏపీలోని భీమవరం జిల్లా ఆకివీడు గ్రామస్తుడినని చెప్పాడు. మణుగూరు శ్రీవారి జ్యువెలర్స్ షాపులో చోరీ చేసింది తానేనని చెప్పాడు. అక్కడ చోరీ చేసిన బంగారు చైన్లు-6, నల్లపూసల గొలుసు-1, బేబీ రింగ్స్-5 (వీటి బరువు సుమారు 132 గ్రాములు) చూపించాడు. వరంగల్‌లోని సాయిగణేష్ జ్యువెలరీ షాపులో చోరీ చేసిన చిన్న చిన్న బంగారం చెవి కమ్మలు 20 జతలు (సుమారు 30 గ్రాములు) కూడా చూపించాడు. ఇతడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని బంగారు షాపుల్లో చోరీ చేసిన కేసులు 35కి పైగా నమోదయ్యాయి. మణుగూరు, వరంగల్‌తో పాటు తిరుపతి, కర్నూలులో కూడా దొంగతనాలు చేసినట్లు ఇతడు ఒప్పుకున్నాడు. ఇతడిని పోలీసులు మణుగూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసును ఛేదించిన ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై ప్రసాద్, సీసీఎస్ ఎస్సై రామారావు, మణుగూరు సిబ్బంది రామారావు, బాలు, సీసీఎస్ సిబ్బంది వెంకట నారాయణ, విజయ్‌లను డీఎస్పీ అభినందించారు.

## సంక్షిప్తం

### టీబీపై అవగాహన

టేకులపల్లి, మే 28: టీబీ వ్యాధిపై మండలంలోని బర్లగూడెం గిరిజన ప్రాంతాల్లో సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

### సమ్మర్ క్యాంప్ సందర్శన

దమ్మపేట, మే 28: మండలంలోని నాగుపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంపును డీవైఎస్‌వో పరంధామిరెడ్డి బుధవారం సందర్శించారు. వాలీబాల్ ఇన్‌చార్జి ఎన్.రాములు, టేబుల్ టెన్నిస్ ఇన్‌చార్జి టి.మల్లేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, హెచ్ఎం సరళ, క్యాంప్ ఇన్‌చార్జి, కోచ్ శివాజీ, అసిస్టెంట్ కోచ్ అభి తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారాలు సక్రమంగా నిర్వహించాలి

అశ్వారావుపేట టౌన్, మే 28: సంత మార్కెట్‌ను సీఐ నాగరాజు బుధవారం సందర్శించారు. అక్కడున్న షెడ్లను వచ్చే వారం నాటికి తొలగించి క్రమ పద్ధతిలో నిర్మించుకోవాలని చెప్పారు. ట్రైనీ ఎస్సై అఖిల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇల్లెందు, మే 28: హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి కోరారు. ఇల్లెందులోని కార్యాలయంలో బుధవారం రెండు హమాలీ యూనియన్ల జిల్లా స్థాయి విలీన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఈ సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా పందిర్లపల్లి వీరన్న, ఉపాధ్యక్షుడిగా బి.మంచా, ప్రధాన కార్యదర్శిగా యాసారపు వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయకులు ఎండి రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, గడ్డం నాగేష్, భిక్షం, కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి విత్తనాలు పంపిణీ

బూర్గంపహాడ్, మే 28: బూర్గంపహాడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం నుంచి జీలుగు, బీపీటీ వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, పొలం పట్టా పాస్ పుస్తకం జిరాక్స్‌లతో మండల వ్యవసాయాధికారిని సంప్రదించవచ్చని సూచించారు.

### జీలుగు విత్తనాలు సిద్ధం

దుమ్ముగూడెం, మే 28: జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దుమ్ముగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 19 టన్నుల జీలుగు విత్తనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### మణుగూరు సీఐగా నాగబాబు

మణుగూరు టౌన్, మే 28: మణుగూరు సీఐగా నాగబాబు బుధవారం విధుల్లో చేరారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

### నేడు వాహనాలకు వేలం పాట

ఇల్లెందు రూరల్, మే 28: ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ఆటోలు, రెండు కార్లు, తొమ్మిది బైక్‌లకు వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్, పాన్ కార్డుతో వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### మహిళలకు ఆటల పోటీలు

ఇల్లెందు రూరల్, మే 28: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఇల్లెందు మహిళా ఉద్యోగులకు బుధవారం జీఎం కార్యాలయంలో ఆటల పోటీలు జరిగాయి. విజేతలకు జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవంలో సందర్భంగా బహుమతులు అందజేస్తారు. పోటీల కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ములకలపల్లి, మే 28: మండలంలోని తాళ్లపాయ పంచాయతీ రింగిరెడ్డిపల్లి గ్రామంలో గ్యాంగ్ వార్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ముత్యాలంపాడు జట్టుకు మొదటి బహుమతిగా రూ.20 వేలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందించారు. రెండవ బహుమతిగా రూ.15వేలను జిన్నెలగూడెం జట్టుకు నాగల వెంకటేశ్వర్లు, తిరుపతిరావు అందజేశారు. మూడో బహుమతిగా రూ.10 వేలను గ్యాంగ్ వారియర్ జట్టుకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తుల అంజి అందజేశారు.

### ఆసుపాక పోస్ట్‌మాస్టర్ సస్పెన్షన్

అశ్వారావుపేట, మే 28: పోస్ట్ మాస్టర్‌ను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. మండలంలోని ఆసుపాక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శశాంక్ ఏడాది కాలంగా ఉత్తరాలు, ఆధార్, పాన్ కార్డులు, బీమా పత్రాలు, పోలీస్ నోటీసులను పంపిణీ చేయడం లేదు. ఏమైనా ఉత్తరాలు వచ్చాయా.. అని గ్రామస్తులు అడిగినా దురుసుగా సమాధానమిస్తున్నారు. దీనిపై కొందరు గ్రామస్తులు అనుమానంతో పోస్టాఫీస్‌ను పరిశీలించగా.. కుప్పలుగా ఉత్తరాలు పేరుకుపోయి కనిపించాయి. దీంతో ఆగ్రహించి, ఈ నెల 28న అశ్వారావుపేట ఎస్పీఎం సాయికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన మణుగూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి.. క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. ఉత్తరాలు బట్వాడా చేయలేదని నిర్ధారించుకున్నని, శశాంక్‌ను సస్పెండ్ చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోందని ఆయన చెప్పారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మే 28: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని బేడా మండపంలో స్వామి వారికి అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ జంటలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## త్వరలో నూతన గని ప్రారంభం

ఇల్లెందు రూరల్, మే 28: ఇల్లెందు ఏరియా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన జేకే కోల్ మైన్ ఉపరితల గనికి అనుమతులు లభించినట్లు ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య స్పష్టం చేశారు. ఆయన బుధవారం జీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నూతన ఉపరితల గనికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు, మంత్రిత్వ శాఖల అనుమతులు లభించినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నూతన జీకే కోల్ మైన్స్ ఉపరితల గనికి కేటాయించిన 1.9 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడానికి సన్నాహాలు రూపొందిస్తున్నామన్నారు.

## ఒకే ఆధార్ కేంద్రంతో ఇక్కట్లు


ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు

మణుగూరు టౌన్, మే 28: మణుగూరు పట్టణంలో ఒకే ఒక ఆధార్ నమోదు కేంద్రం ఉండడంతో రద్దీ ఏర్పడుతున్నది. ఒక్కటే ఉండటంతో ప్రజలు రోజూ బారులు తీరుతున్నారు. ఒక్కోసారి సిగ్నల్స్ లేకపోతే.. గంటలతరబడి వేచి చూసి విసుగెత్తిపోతున్నారు. మరో రెండు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


నగదును డిపోలో అందజేస్తున్న ఆర్టీసీ డ్రైవర్

మణుగూరు టౌన్, మే 28: ఆర్టీసీ మణుగూరు డిపో డ్రైవర్ ఇల్లటూరి మహేష్.. తన నిజాయితీ చాటుకున్నారు. ఆయన మంగళవారం మణుగూరు నుంచి అమలాపురం డ్యూటీకి వెళ్లి తిరిగొచ్చారు. బస్సును డిపోకు తీసుకెళ్లారు. ఇదే బస్సులో ప్రయాణించిన అశ్వారావుపేటకు చెందిన ప్రయాణికుడు.. లక్ష రూపాయలున్న పర్సు బస్సులో పడిపోయిందని ఆర్టీసీ అధికారులకు తెలిపాడు. అధికారుల ద్వారా ఈ సమాచారం అందుకున్న మహేష్.. బస్సులో తనిఖీ చేయగా పర్సు దొరికింది. దానిని ఆయన మణుగూరు డిపో సెక్యూరిటీ అధికారులకు అప్పగించారు. ఆ పర్సును, దానిని పోగొట్టుకున్న ప్రయాణికుడికి ఆర్టీసీ అధికారులు బుధవారం ఉదయం అందజేశారు. డ్రైవర్ మహేష్‌ను డిపో మేనేజర్ శ్యాంసుందర్ అభినందించారు.

## రైల్వే నిర్వాసితులకు చెక్కులు అందజేత


చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్, మే 28: భద్రాద్రి పవర్ ప్లాంట్ రైల్వే ట్రాక్ నిర్మాణంతో భూములు కోల్పోయిన మణుగూరు మండలానికి చెందిన గాంధీనగర్, సుందరయ్యనగర్, కాళీమాత ఏరియా, శేషగిరి నగర్‌కు చెందిన 24 మందికి చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. తహసీల్దార్ అద్దంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బృందం పర్యటన


ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ములకలపల్లి, మే 28: మండలంలోని సీతారాంపురం, ములకలపల్లి పంచాయతీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బృందం బుధవారం మండలంలో పర్యటించింది. ఉపాధి హామీ పనులు, ఇంకుడు గుంతలు, నర్సరీలు, బృహత్ ప్రకృతి వనాలను పరిశీలించింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో భాగంగా చేపట్టిన ములకలపల్లి-మూకమామిడి రహదారిని పరిశీలించింది. ఈ బృందంలో రాకేష్, ఎంపీసీ కుమార్, వివేక్‌కుమార్ ఉన్నారు. డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో రేవతి, ఇన్‌చార్జ్ ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జోరున వర్షం


లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు

కరకగూడెం, మే 28: మండలవ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి రెండు గంటలపాటు జోరున వర్షం కురిసింది. పంట భూముల్లోకి, వాగుల్లోకి వరద నీరు చేరింది. వర్షాలు ముందస్తుగా కురవడంతో రైతులు పొలం పనులకు సిద్ధమవుతున్నారు.

## ఆదివాసీ గ్రామానికి తాత్కాలిక రోడ్డు


తాత్కాలికంగా వేసిన రోడ్డు

చర్ల, మే 28: నాలుగు దశాబ్దాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి మండల సరిహద్దులోని అడవిలోకి వలస వచ్చిన ఆదివాసీలు.. రాళ్ళగట్ట పేరుతో అక్కడ ఓ గ్రామం ఏర్పాటు చేసుకున్నారు. రిజర్వ్ ఫారెస్టులోగల ఈ గ్రామానికి రహదారి నిర్మించేందుకు అవకాశం లేదు. రోడ్డు లేకపోవడంతో ఇక్కడి ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్ల పోలీసులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ దగ్గరుండి మరీ తాత్కాలిక రోడ్డును మంగళవారం నిర్మించారు. వారికి రాళ్లగట్ట ఆదివాసీలు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బూర్గంపహాడ్, మే 28: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బూర్గంపహాడ్‌కు చెందిన జానకమ్మ(51), స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నది. తమ బంధువు ద్విచక్ర వాహనంపై బుధవారం పాఠశాలకు బయలుదేరింది. గౌతంపురం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, ఈమె ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. జానకమ్మ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. వాహనం నడుపుతున్న ఆమె బంధువుతోపాటు ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని, క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జానకమ్మ బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి నేడు శంకుస్థాపన


శిలాఫలకం నిర్మాణం చేస్తున్న దృశ్యం

చుంచుపల్లి, మే 28: పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి గ్రామానికి వెళ్లి దారిలో ఉన్న వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. లో లెవల్ చప్టా ఉండడంతో ఏటా వర్షాకాలంలో వాగు పొంగి ప్రవహించడంతో ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. ఈ నేపథ్యంలో రూ.6.50 కోట్లతో ఈ వాగుపై నిర్మించనున్న బ్రిడ్జికి రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం శంకుస్థాపన చేయనున్నారు.